## మినీకథ



"ఏమండోయ్ అన్నం వడ్డించేశానండి" వంటింట్లోనుంచి సుజాత కేకేసింది.

నిలువుటద్దం ముందు నిల్చుని క్రాపు దువ్వుకుంటున్న గోవిందరావు "ఇదిగో వచ్చేస్తున్నా" అంటూ ఫైనల్ టచ్‌గా ఓసారి తల దువ్వుకుని మీదున్న తువ్వాలుతో ముఖం తుడుచుకుంటూ వంటింట్లోకి వచ్చేడు

కంచంముందు కూర్చున్న గోవిందరావుకు ఘుమ ఘుమ లాడుతున్న గుత్తివంకాయ కూర చూడగానే నోరూరింది. మరుక్షణమే నూనెలో తేలుతున్న ఆ కూరను చూసి ఒళ్ళు కూడా మండింది. భార్య దుబారా చూసి ప్రాణం గిలగిలలాడింది

"నూనె కేన్‌లో నూనె వుందా అయిపోయిందా" అన్నం కలుపుతూ కోపంగా అడిగేడు

"ఉండండి. కూరలో నూనె వేస్తుంటే తొందరలో ఎక్కువే పడింది" ఎంతో సౌమ్యంగా చెప్పింది

"అది సరే, ఆ దేవుని దగ్గర దీపం వెల్గించి ఎంత సేపయింది?"

"పావుగంటవుతోంది."

"పావుగంట నుంచి ఏకధాటిగా వెలుగుతున్నదంటే ప్రమిదలో ఎంత నూనె పోసి వుంటావో ఆలోచించు. నూనెలో వత్తిముంచి దీపం పెడితే దేవుడు ఒప్పుకోడా ఏం. ఆ అగరొత్తులు ప్రతీ శుక్రవారం ఒకటి చొప్పున వెల్గించమని చెపితే రోజూ ఎందుకు వెల్గిస్తున్నావు-అయిపోవా" ఆవేశంగా అన్నాడు.

సుజాత తల దించుకుని మౌనం పాటించింది.

"ఏరా వెధవా ఆ రేడియో కట్టరా. బ్యాటరీలు అయిపోతాయి. ప్రొద్దస్తమానూ రేడియో వాగుతూవుండాలా. ఆ బ్యాటరీలు నాల్గు నెలలు రావాలి. ఈమధ్య అయిపోయాయో చచ్చినా కొనను."

హాలులో రేడియో పెద్దగా పెట్టుకుని నాటకం వింటున్న పెద్ద కొడుకు నుద్దేశించి గట్టిగా అరిచేడు.

ఇంతలో రెండో కొడుకు అక్కడికి వచ్చేడు.

"నాన్నా. పరీక్షలై పోయేయి. స్నేహితులతో సినిమా కెళ్ళాలి. ఓ ఐదు రూపాయలివ్వండి నాన్నా" రెండో కొడుకు భయం భయంగానే అడిగేడు.

"సినిమా కెళితే బస్సు చార్జీలు. టికెట్టు. గోల్డ్‌స్పాటులు వగైరాలకు డబ్బు ఖర్చు. హాయిగా యింట్లో కూర్చుని కేరమ్స్ ఆడుకో" సలహా పారేసేడు గోవిందరావు.

మారు మాట్లాడితే తండ్రి కొడతాడని విసుక్కుంటూ. గొణుక్కుంటూ అక్కడ నుంచి వెళ్ళిపోయేడు కొడుకు.

"ఏమండీ ఈ రోజు మీ స్నేహితునింట్లో ఫంక్షనుంది మరచిపోయేరా" ఆఫీసు కెళుతున్న భర్తకు గుర్తు చేసింది సుజాత.

"గుర్తుంది- వెళ్ళాలి అందులో గొప్పింటి ఫంక్షన్. ప్రజంటేషన్ గొప్పగానే వుండాలి. నా దగ్గర పట్టుమని పది రూపాయలు కూడా లేవు. కనపడిన వాడినల్లా అప్పడిగేను అప్పు పుట్టలేదు."

"వట్టిచేతులతో వెళ్ళలేం. అలాగని మానేస్తే బాగుండదు" భయపడుతూనే నెమ్మదిగా అంది సుజాత.

"అదీ నిజమే. ఏం చేయమన్నావు చెప్పు. ఈ నెలజీతం చూసేవు కదా! ఆఫీసర్ బావమరిది కొడుకుపెళ్ళి ప్రజెంటేషన్‌కు పాతిక. హెడ్‌క్లర్కు కూతురు పెళ్ళికి- పదిహేను స్టెనో తమ్ముడు పెళ్ళికి- పది. మా మేనేజర్ కొడుకు వుపనయనానికి- ఇరవై - ఇక ప్యూన్ పెళ్ళికి- పది. ఇలా బోలెడన్ని కటింగ్స్. ఇవి చేతిలో డబ్బున్నా. లేకపోయినా అప్పయినా చేసి కట్టవలసిన బాకీలు. ఇంక యింటికొస్తే పక్కింట్లో పేరంటం. ఎదురింట్లో పేరంటం. స్నేహితులు. బంధువులు, తెల్సినవారిళ్ళలో పేరంటం. ఇంక అడగనవసరంలేదు. ఇవి యిలా వుంటూనే వుంటాయి. రెండోవాడికి ఒంట్లో బాగోలేదని చెప్పేసి వూరుకో" ఓ సలహా పారేసి వెళ్ళిపోయేడు గోవిందరావు.

గోవిందరావు ఆఫీసుకు వెళ్ళిన పది నిముషాలకు స్నేహితుని యింటినుంచి ఫోన్ వచ్చింది. రమ్మనమని- మరోసారి పిలుపు పదే పదే పిలిపించుకోవడం మర్యాద కాదని మేనేజర్ దగ్గర అర్జెంటుగా కావాలని ఓ ఏభై రూపాయలు అప్పు అడిగి ఆఫీసు విడవగానే ప్రజంటేషన్ కొని పట్టుకెళ్ళేడు.

ఫంక్షన్ పూర్తయేసరికి రాత్రి ఎనిమిదయింది

ఇంట్లో అడుగు పెడుతున్న గోవిందరావుకు చిరునవ్వుతో ఎదురొచ్చింది సుజాత.

"ఏమిటి విశేషం. ఈ రోజు చాలా హుషారుగా వున్నావ్" భార్య భుజం మీద చేయివేసి లోనికి నడుస్తూ అడిగేడు

"ఈ రోజు చాలా మంచి రోజండి" అంది సుజాత చిరునవ్వుతో.

"ఎందుచేత" ఆశ్చర్యంతో చూసేడు గోవిందరావు.

"ఎవరినీ అప్పు అడక్కుండానే, కానీ ఖర్చు కాకుండానే ఫంక్షన్‌కు వెళ్ళవలసిన మన ప్రోబ్లెం యిట్టేసాల్వ్ అయిపోయిందండి." ఆమెలో వుత్సాహం వురకలేసింది.

"నిజంగా?"

"అవునండి."

"ఎలా?"

"నిన్న మీరు తెచ్చిన బొమ్మలేదూ దానిని అందంగా ప్యాక్ చేసి వెళ్ళి యిచ్చి వచ్చేనండి" చెప్పుకుపోతోంది సుజాత.

"ఓ మై గాడ్" కుప్పలా కూలిపోయేడు గోవిందరావు. అది ఆఫీసర్ బొంబాయి నుంచి తెప్పించుకున్నది! రెండొందలు ఖరీదుచేసే బొమ్మని. అది పట్టుకెళ్ళి ఆఫీసర్‌కు ఈ రోజు యివ్వడం మరచిపోయేడని ఆమెకేం తెలుసు.

కె. రమణమ్మ